సాక్షి
వికారాబాద్

బుధవారం ׀ 27 ׀ ఆగస్టు ׀ 2025



జల కళ
జిల్లాలోని చెరువులు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. సమృద్ధిగా కురిసిన వానలతో భారీగా నీళ్లు చేరాయి. 10లో▸



విధుల బహిష్కరణ
న్యాయవాద రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ డిమాండ్ చేశారు. 10లో▸



డీజేలకు అనుమతులు లేవు
వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. 11లో▸

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ



డీపీఆర్వో చెన్నమ్మకు మట్టి గణపతి ప్రతిమ అందజేస్తున్న అధికారులు

అనంతగిరి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 12 వేల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గణపతి విగ్రహాలను చెరువు మట్టితో తయారు చేసి చెరువులోనే నిమజ్జనం చేద్దామని వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రెయినీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఈఓ రేణుకా దేవి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సిద్ధార్థ, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎస్టీ వెల్ఫేర్ అధికారి కమలాకర్ రెడ్డి, డీపీఆర్వో చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్‌పోటీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

అనంతగిరి: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఎంహెచ్‌ఓ లలితాదేవి బహుమతులు అందజేశారు. డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ (దిశ) జిల్లా వైద్యారోగ్యశాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఆలంపల్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, హెచ్‌ఎం దేవయ్య, దిశ సీపీఎం నరేందర్, సీఎస్‌ఓ రమేశ్. ఐసీటీసీ కౌన్సిలర్ రత్నాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలనలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం పాలనలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లన్నీ పాడయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని.. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పని చేయకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా నుంచి ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లా నేటికీ వెనుకబడిపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం యూరియా సరఫరాలోనూ విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రంను డీటీ పరుషరామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మాధవి, ఉపాధ్యక్షుడు శివరాజ్, కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు యాదవరెడ్డి, శ్రీమంత్‌కుమార్, గణేశ్, అన్నపూర్ణ, బలరాంగౌడ్, రమేశ్, శాంతకుమార్, ఆనందం, అమర్‌నాథ్, మధు తదితరులు ఉన్నారు.



దుద్యాల్: మండపానికి తరలుతున్న గణనాథుడు

గణపయ్యా.. ఆగయా

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. మండపాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. వివిధ రూపాల్లో కొలువైన గణనాథుల విగ్రహాలను మండపాలకు తరలించారు. పండుగ నేపథ్యంలో మంగళవారం ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. పూజకు కావాల్సిన పూలు, పండ్లు, పత్రులు, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్సవ విశిష్టతను వివరించారు.



కొడంగల్ రూరల్: గణపతి ఆకారంలో గురుకుల విద్యార్థులు

అప్పుల తిప్పలు



పంచాయతీల్లో నిలిచిన అభివృద్ధి
- రూ.29 కోట్ల బకాయి
- ఇటీవల రూ.150 కోట్లు విడుదలైనా జిల్లాకు జీరో నిధులు
- పాలకవర్గం లేక నిలిచిన సెంట్రల్ ఫండ్

వికారాబాద్: గ్రామ స్వరాజ్యానికి పట్టు కొమ్మలుగా పిలిచే పంచాయతీలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. రెండున్నర ఏళ్లుగా బిల్లులు అందక గ్రామాలు వెలవెలబోతున్నాయి. సర్పంచ్‌లు పదవుల్లో ఉన్న సమయంలో చేసిన పనులకు సబంధించిన బిల్లులు సైతం నేటికీ అందడం లేదు. అప్పుల భారంతో సర్పంచ్‌లు పదవీవిరమణ చేయగా.. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు అప్పులు పాలవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 594 పంచాయతీలకుగాను రూ.29 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం మాజీ సర్పంచ్లు, పంచాయతీ కార్యర్శులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో రూ.750 కోట్ల వరకు జీపీల బిల్లులు పెండింగులో ఉండగా ఇటీవల ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసింది. అయితే ఇందులో జిల్లాకు చిల్లిగవ్వ రాలేదు.

నిర్వహణ భారం

బీఆర్‌ఎస్ హయాంలో సర్పంచ్‌లు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లు, క్రిమిటోరియం తదితర పనులకు సంబంధించిన బిల్లులు కోట్ల రూపాయల్లో పెండింగులో ఉండిపోయాయి. గ్రామాలకు సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం మినహా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. శానిటేషన్, వీధి లైట్లు, వాటర్ సప్లై నిర్వహణ, ట్రాక్టర్లకు డీజిల్ బిల్లులు పెండింగులో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీల్లో కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చక్కపెడుతున్నామని.. వీటికి వడ్డీ కట్టలేక సతమతమవుతున్నామని.. తమకు ఈ బాధ్యతలు వద్దంటూ ఎంపీడీఓకు పంచాయతీల తాళాలు అప్పగించారు. ఉన్నతాధికారులు వారిని సముదాయించి మళ్లీ వారికే అప్పగించారు.


రూ.10.35 కోట్ల 'మనఊరు-మనబడి' బిల్లులు

నాలుగేళ్ల క్రితం మనఊరు-మనబడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 1,130 ప్రభుత్వ పాఠశాలలుండగా మూడింట ఒకటో వంతు చొప్పున తొలి విడతలో 371 పాఠశాలల అభివృద్ధి పనులు ప్రారంభించారు. రెండున్నరేళ్లు కొనసాగిన ఈ కార్యక్రమంలో 62 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. వీటికి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.21.94 కోట్ల నిధులు విడుదల చేయగా.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నుంచి రూ.2.5 కోట్లు కలుపుకొని మొత్తం రూ.24.4 కోట్ల బిల్లులు చెల్లించారు. ఇంకా ఆ సమయంలో పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.7.35 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులు, రూ.3 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సిన నిధులు మొత్తం రూ.10.35 కోట్ల బిల్లులు ఇంకా ఇవ్వాల్సిఉంది. ఈ పనులు కూడా ఆ సమయంలో ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులే నిర్వహించారు. పనులు పూర్తయి మూడేళ్లు దాటినా బిల్లులు మాత్రం రావడం లేదు.

నిధుల విడుదలకు బ్రేక్

గతంలో పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులు నేరుగా జీపీల అవసరానికి ఖర్చు చేసే అవకాశం ఉండేది. 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పన్నులు ట్రెజరీలో జమచేయాలనే నిబంధన తీసుకువచ్చింది. నాటి నుంచి వాటిని ప్రభుత్వ అనుమతితో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఈ ఖాతాలను ఎక్కువగా ఫ్రీజింగ్‌లోనే ఉంచుతోంది. మరో వైపు ప్రజల చేత ఎన్నుకోబడిన పాలక మండళ్లు లేక కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులకు సైతం బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిధులు మంజూరు చేయక పాత బిల్లులు విడుదల చేయక నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కేంద్ర నిధులు సైతం రాకపోవటంతో పంచాయతీల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

ఉల్లంఘనులు



కొర్విచెడ్‌లో అక్రమంగా తవ్వుతున్న నాపరాతి గని

లీజు లేకుండానే గనుల తవ్వకాలు
- కార్మికుల మాటున సర్కారు భూముల్లో మైనింగ్
- రాయల్టీ చెల్లించకుండా రవాణా
- ప్రభుత్వాదాయానికి గండికొడుతున్న అక్రమార్కులు

బషీరాబాద్: నాపరాతి నిక్షేపాలను అక్రమార్కులు దర్జాగా దోపిడీ చేస్తున్నారు. కొందరు వ్యాపారులు లీజులు తీసుకోకుండానే ప్రభుత్వ వనరులను కొల్లగొడుతున్నారు. అసైన్డ్, శిఖం భూములను కబ్జాలు చేసి తవ్వకాలు చేపడుతున్నారు. రాయల్టీలు సైతం చెల్లించకుండా నిత్యం పదుల సంఖ్యలో లారీల ద్వారా తాండూరు, హైదరాబాద్‌కు నాపరాతిని రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

అసైన్డ్ భూములనూ వదలక..

మండల పరిధిలోని కొర్విచెడ్, నవల్గా, క్యాద్గీరా, జీవన్గీ, ఎక్మాయి గ్రామాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొర్విచెడ్ పరిధిలోని సర్వే నంబర్ 101లో 170 ఎకరాల్లో, చెరువు శిఖంలో 40 ఎకరాల వరకు గని నిక్షేప భూములు ఉన్నాయి. జీవన్గీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 238లో 30 ఎకరాలు పేదలకు సాగుభూమి కింద అసైన్డ్ చేశారు. ఆయా భూముల్లో వ్యాపారులు కార్మికులను అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా మైనింగ్ జరుపుతున్నారు.


రాయల్టీకి ఎగనామం

గనుల్లో వెలికి తీసిన నాపరాయిని లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తే ఒక్కో లారీకి రూ.3,600 మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించాలి. రోజు పదుల సంఖ్యలో లారీలు వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ఒక్కో లారీకి రూ.300 అక్రమంగా వసూలు చేసి అధికారులకు అప్పగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అడ్డుకోని అధికార యంత్రాంగం

మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో వందల గనుల్లో లీజులు లేకుండా అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం అటుగా కన్నెత్తి చూడడం లేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నా పట్టించుకోవడం లేదనే అపవాదు ఉంది. కార్మికులు ఈ తవ్వకాలు చేపడుతుండడంతో వారి ఉపాధిని దెబ్బతీయొద్దని రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తేవడంతో చర్యలకు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

“ చర్యలు తీసుకుంటాం



మైనింగ్ లీజులు లేకుండా ప్రభుత్వ భూముల్లో, పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ సంపదను అక్రమంగా దోచుకుంటే కేసులు నమోదు చేస్తాం. మైనింగ్ ద్వారా లీజులు తీసుకుని తవ్వకాలు చేపట్టాలి. నాపరాతి రవాణా చేసే లారీలు తప్పనిసరిగా రాయల్టీ చెల్లించాలి. లేదంటే వాహనాలను సీజ్ చేస్తాం.

– షాహెదాబేగం, తహసీల్దార్

వినాయక చవితి శుభాకాంక్షలు

శాసన సభాపతి ప్రసాద్‌కుమార్



అనంతగిరి: గణేశ్ చతుర్థి పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లా ప్రజలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, తలపెట్టిన కార్యాలను విజయవంతంగా పూర్తి చేయడానికి అనుగ్రహించే వినాయకుని ఆశిస్సులతో అందరూ సుఖశాంతులతో జీవించాలన్నారు. తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే వినాయకుడి పూజలకు మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఆసియా క్రీడలకు గిరిపుత్రిక



ధనశ్రీ పవార్‌ను సత్కరిస్తున్న పుణే స్పోర్ట్స్ అథారిటీ అధికారులు

బంట్వారం: మూడవ యూత్ ఆసియా క్రీడా పోటీలకు మండల పరిధిలోని నాగవరం తండాకు చెందిన ధనశ్రీ పవార్ ఎంపికైంది. నాసిక్‌లో ఇటీవల నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా పోటీల్లో తైక్వాండో అండర్-17 జూనియర్ బాలికల 55 కేజీల విభాగంలో ఆమె గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో ధనశ్రీ పవార్ బహ్రెయిన్‌లో నిర్వహించనున్న తైక్వాండో చాంపియన్‌షిప్ మూడవ యూత్ ఆసియా క్రీడలు-2025 దేశం నుంచి పాల్గొననుంది. ప్రస్తుతం ఇండియన్ ట్రైనింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా పూణే స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ధనశ్రీని ఘనంగా సన్మానించారు. తమ కూతురు ఆసియా పోటీలకు ఎంపికవడంపై తల్లిదండ్రులు శంకర్‌నాయక్, మనీష ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరు ఉద్యోగ రీత్యా పూణేలో స్థిరపడ్డారు.

తుది జాబితాకు నోటిఫికేషన్

సెప్టెంబర్ 2న విడుదల చేయాలని డీపీఓలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు



వికారాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ సన్నాహకాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీపీఓలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 28న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీలతో పాటు వార్డుల్లో పబ్లిష్ చేయాలని, 29న రాజకీయ పార్టీలతో జిల్లా సమావేశం నిర్వహించాలని, 30న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించింది. 28వ తేదీ నుంచి 30 వరకు ఓటరు జాబితా, వార్డుల విభజన తదితర అంశాలపై రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు డీపీలు స్వీకరించనున్నారు. వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి ఈ నెల 31వ తేదీన డీపీఓలు అభ్యంతరాలను డిస్పోజ్ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అనంతరం సెప్టెంబర్ 2న ఓటరు, వార్డుల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది.

ముందుగా పంచాయతీ ఎన్నికలు?

జిల్లాలో మొత్తం 3,44,963 పురుషులు, 3,54,912 మంది స్త్రీలు,19 మంది ట్రాన్స్ జెండర్లు కలుపుకొని మొత్తం 6,99,894 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 594 గ్రామ పంచాయతీలుండగా వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఎస్టీలకే రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన సైతం తెరపైకి వచ్చింది. గతంలో జిల్లాలో 4,850 వార్డులు ఉండగా ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులకు పెరిగాయి. ఈ వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ చివరి వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ముందుగా పంచాయతీ ఎన్నికలకే వెళతారనే చర్చలు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ ఏ క్షణమైనా వచ్చే అవకాశముందని భావించి పంచాయతీ ఎన్నికలకు కసరత్తు చేస్తున్నారు.

ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల కసరత్తు పూర్తి

జిల్లాలో గతంలో 566 జీపీలు ఉండగా మండలాల పునర్విభజనతో ఆ సంఖ్య 585కు చేరింది. ఇటీవల నారాయణపేట్, మహబూబ్‌నగర్ పొరుగు జిల్లాల నుంచి కొన్ని పంచాయతీలు జిల్లాలో కలవడంతో పంచాయతీల సంఖ్య 594కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులున్నాయి. ఏడాదిన్నర క్రితం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయగా వాటికి అదనంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని బూత్‌లు అవసరమవుతాయని అధికారులు వివరాలు సేకరించారు. అదనంగా ఎన్ని పోలింగ్ స్టేషన్లు అవసరం.. ఎంత మంది సిబ్బంది అవసరం, ఇంకా చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలకు సంబంధించి వివరాలు సేకరించారు. ఓటర్లను సైతం వార్డుల వారీగా విభజించి ఎన్ని బూత్‌లు అవసరమనే విషయంలో కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆరు నెలల క్రితమే గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం పోలింగ్ స్టేషన్ల జాబితా తయారు చేసి జిల్లా ఎన్నికల అధికారి నుంచి అమోదం పొందారు. వీటికి సంబంధించి పోలింగ్ స్టేషన్ల జాబితా ముసాయిదాను ప్రచురించడంతో పాటు అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను సైతం ఆమోదించారు. ప్రస్తుతం వార్డుల వారీ జాబితాతో పాటు ఓటరు తుది జాబితాను ప్రచురించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో దాదాపు ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టయ్యింది.

మండలం	జీపీల సంఖ్య	వార్డుల సంఖ్య
వికారాబాద్	21	182
ధారూరు	34	286
మోమిన్‌పేట్	29	256
బంట్వారం	12	106
మర్పల్లి	29	264
కోట్‌పల్లి	18	150
తాండూరు	33	290
బషీరాబాద్	39	312
యాలాల	39	318
పెద్దేముల్	38	308
కొడంగల్	25	222
దౌల్తాబాద్	34	298
బొంరాస్‌పేట్	35	292
దుద్యాల	19	158
పరిగి	32	268
పూడూరు	32	282
కుల్కచర్ల	33	280
చౌడాపూర్	24	202
దోమ	36	308
నవాబుపేట	32	276
మొత్తం	594	5058

యూరియా సరఫరాపై సమీక్ష



జిల్లా స్థాయి అధికారులతో సమీక్షిస్తున్న లింగ్యానాయక్

అనంతగిరి: యూరియా లభ్యతపై రైతులకు భరోసా ఇవ్వాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యూరియా లభ్యత, సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది జిల్లాలో 19,764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించామని, ఈ ఏడాది ఇప్పటికే 19,534 మెట్రిక్ టన్నుల యురియా సరఫరా చేశామన్నారు. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1,080 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా నుంచి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికీ జిల్లాలో వేయి లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడీఏ సందీప్ కుమార్, ఏడీలు ప్రసన్న లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి సీజ్


తరగతి గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ గోపాల్

సాక్షి ఎఫెక్ట్..

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్న తరగతిని మంగళవారం అధికారులు సీజ్ చేశారు. మండల విద్యాధికారి గోపాల్ పాఠశాలను సందర్శించి ఎలాంటి అనుమతులు లేకుండానే 9వ తరగతి పాఠాలు నిర్వహిస్తుండటంతో నోటీసులు జారీ చేసి తరగతి గదిని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. ఎన్ని తరగతుల వరకు అనుమతులు ఉంటేనే అంత వరకే తరగతులు నిర్వహించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీసీ సిబ్బంది శ్రీశైలం, మోహన తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ పాఠశాల హెచ్‌ఎంగా వెంకటయ్య


పదోన్నతి పొందిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ సీపీఎస్ హెచ్‌ఎంగా వెంకటయ్య నియమితులయ్యారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా చిట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వెంకటయ్య పదోన్నతి పొంది దౌల్తాబాద్ బాలికల ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంగా వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి పనిచేస్తున్న సాయిలు, పదోన్నతి పొందిన హెచ్‌ఎం వెంకటయ్యను స్థానిక ఉపాధ్యాయులు సన్మానించారు.

పురుగు మందు కలిపిన నీటిని తాగి..

15 మేకలు మృత్యువాత


మృతిచెందిన మేకలు

బంట్వారం: తొట్టిలో కలిపిన పురుగు మందు నీటిని తాగి 15 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శైలజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నారానికి చెందిన వెల్చాల్ రాసయ్య తన పొలంలో గడ్డి మందు కొట్టేందుకు నీటి తొట్టిలో పురుగు మందు కలిపి మూత పెట్టలేదు. అదే గ్రామానికి చెందిన అంజయ్య మేకలు మేపుతూ వస్తుండగా సమీపంలోని తొట్టిలో నీటిని తాగి 15 మేకలు మృత్యువాత పడ్డాయి. అంజయ్య కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శైలజ తెలిపారు.

తామర పూలు కోసేందుకు వెళ్లి..

వ్యక్తి మృతి


బాలయ్య(ఫైల్)

పరిగి: గణపతి పూజకు తామర పూలు తెచ్చేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మిట్టకోడూరులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. దోమ మండలం ఉదన్‌రావుపల్లికి చెందిన బాలయ్య(55), కృష్ణయ్య తామర పూలు కోసేందుకు మిట్టకోడూరు చెరువు వద్దకు వచ్చారు. చెరువులోకి దిగి తామర పూలు కోస్తుండగా బాలయ్య కాళ్లకు తామర తీగచుట్టుకుని నీట మునిగి గల్లంతయ్యాడు. గమనించిన కృష్ణయ్య ఒడ్డుకు చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పంచాయితీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య బాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో పేకాట రాయుళ్లను కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాథోడ్ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం.. కరన్‌కోట్ గ్రామానికి చెందిన తొమ్మిది మంది మంగళవారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విషయం తెలుసుకున్న పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.9,460తో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


వరద పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

జల కళ

జిల్లావ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు

- నిండిన చెరువులు, ప్రాజెక్టులు
- సాధారణానికి మించి వర్షపాతం నమోదు

మండలం	మొత్తం చెరువులు	50శాతం	75 శాతం	100 శాతం	అలుగు దాటినవి
పెద్దేముల్	52	10	42	-	-
తాండూరు	43	4	2	37	-
బషీరాబాద్	51	8	43	-	-
యాలాల	107	21	86	-	-
కోట్‌పల్లి	32	10	22	-	-
మర్పల్లి	57	24	29	-	-
వికారాబాద్	48	7	5	11	25
బంట్వారం	9	-	09	-	-
నవాబుపేట	30	23	02	-	-
మోమిన్‌పేట	76	12	45	19	-
ధారూర్	74	01	73	-	-
కొడంగల్	54	13	33	07	-
బొంరాస్‌పేట	97	03	32	22	-
దౌల్తాబాద్	48	12	28	04	-
దుద్యాల	53	09	42	02	-
పూడూరు	12	02	03	07	-
పరిగి	51	02	32	19	-
కుల్కచర్ల	97	47	37	13	-
దోమ	144	71	54	19	-
చౌడాపూర్	105	33	49	13	-

తాండూరు: జిల్లాలోని చెరువులు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. సమృద్ధిగా కురిసిన వానలతో భారీగా నీళ్లు చేరాయి. ఇప్పటికే ప్రధాన జలాశయాలు నిండి మత్తడులు దూకుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు చెరువులు, ఫీడర్ చానల్‌లు ఆక్రమణకు గురయ్యాయి. వీటిలోనూ ఆశించిన స్థాయిలో వరద నీరు చేరుకోవడం గమనార్హం. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో జిల్లా నీటి పారుదల శాఖ ఆధీనంలో 1,187 చెరువులు, కుంటలు, 9 ప్రాజెక్టులున్నాయి. వీటి కింద 78 వేల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజ వకర్గాలలోఉన్న 9 ప్రధాన ప్రాజెక్టులు అలుగుదాటి ప్రవహిస్తున్నాయి.

పక్షం రోజుల వ్యవధిలోనే..

సీజన్ ప్రారంభమైన జూన్ మాసంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలై నెలాఖరు వరకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. అయితే జూలై నెల చివరి మూడు రోజుల నుంచి వర్షాలు కు రవడం ఊపందుకుంది. ఈనెల మొదటి వారం నుంచి విస్తారంగా వానలు పడటంతో చెరువుల్లోకి భా రీగా వరద నీరు చేరింది. జిల్లాలోని 448 చెరువులు అలుగు పారాయి. మరో 370 చెరువులు తొంభైశాతానికి పైగా నిండాయి. 211 చెరువులు 75శాతం, 158 శాతం చెరువులు 50శాతం నిండాయి.

అలుగు పారుతున్న ప్రాజెక్టులు

జిల్లాలోని కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి, అల్లాపూర్, నందివాగు, కక్రావేణి, కొంశెట్టిపల్లి, శివసాగర్, జుంటిపల్లి ప్రాజెక్టులు అలుగు పారాయి.

578.4 ఎంఎంల వర్షపాతం

వర్షాకాలం సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 411.4 ఎంఎంలు కాగా, జిల్లాలో 578.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. పది మండలాల్లో అధిక,5మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నవాబుపేట, పరిగి, దోమ, బొంరాస్‌పేట్, ధారురు మండలాల్లో అత్యధిక వర్షపాతంనమోదు కాగా, మర్పల్లి, కుల్కచర్ల, కోట్‌పల్లి, బంట్వారం, పెద్దేముల్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మలేరియా, ఫైలేరియా ప్రత్యేక అధికారి ఫకీరప్ప


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

దుద్యాల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మలేరియా, ఫైలేరియా ప్రత్యేక అధికారి ఫకీరప్ప అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేజీబీవీలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ముసురు వర్షాల కారణంగా బ్యాక్టీరియా వ్యాప్తి చెంది దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, కేజీబీవీ ప్రత్యేకాధికారి రాధిక, పాఠశాల సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడాలి

జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం

పూడూరు: యూరియాకు బదులు నానో యూరియాను వాడాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. మంగళవారం చన్గోముల్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాల కారణంగా పంటల్లో సూక్ష్మధాతువుల లోపం వచ్చే అవకాశం ఉందని అన్నారు. అనంతరం పలు గ్రామాల్లో పత్తి పంటలను ఆయన పరిశీలించారు. కండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పత్తి పంటను పరిశీలించారు. పొలంలో మెగ్నీషియం లోపం ఉందని గుర్తించారు. తప్పనిసరిగా పత్తి పంటకు మెగ్నీషియం, బోరాక్స్‌ను పిచికారీ చేయాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసిరాం, ఏఈఓ ఇలియాస్,డీలర్‌లు నర్సింహారెడ్డి, అనంత్ రెడ్డి, భూపతిరెడ్డి, రైతులు మహేశ్, వెంకటయ్య, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కండ్లపల్లిలో పత్తిచేనుని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

భక్తిశ్రద్ధలతో వీరభద్ర స్వామి జయంతి


పూజలో వీరశైవ సమాజం సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో మంగళవారం వీరశైవ సమాజం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఆలయ పురోహితులు మడపతి జగదీష్‌స్వామి సమక్ష్యంలో వీరభద్రేశ్వర స్వామివారికి, భద్రకాళి అమ్మవారికి శివలింగానికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణ, దూప, దీప, నైవేద్యం సమర్పించారు. భక్తులు ఖడ్గాలు వేస్తూ స్వామివారిని వేడుకున్నారు. అనంతరం మంగళహారతులు ఇచ్చి స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం పట్టణ అధ్యక్షుడు జంగం శాంతుకుమార్, ఉపాధ్యక్షుడు బుక్క విజయకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖరస్వామి, బొంరాస్‌పేట మండల సంఘం గౌరవ అధ్యక్షుడు జగదీష్‌స్వామి, గడ్డం అఖిలేశ్వర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అనంతగిరి: న్యాయవాద రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్ అడ్వకేట్ తన్నీరు శ్రీకాంత్‌పై సోమవారం దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులంతా ఏకతాటిపైకి వచ్చి చట్టం చేసే వరకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పోలీస్ వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు కమాల్‌రెడ్డి, లవకుమార్, గోవర్ధనరెడ్డి, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, సంపూర్ణనంద్, శంకరయ్య, మాధవరెడ్డి, . శుక్లవర్ధన్ రెడ్డి, మహ్మద్ రఫీ, అశోక్ కుమార్, శుభప్రద్ పటేల్, ఆనంద్ గౌడ్, గోపాల్, రాజశేఖర్ మోహన్ రాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇప్పిస్తామని భూమికి ఎసరు

ముగ్గురు నిందితుల రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రమేశ్‌కుమార్

కుల్కచర్ల: రైతు తెలియకుండానే భూమిని విక్రయించిన ముగ్గురు మధ్యవర్తులను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన రైతు కావలి పాండుకు సర్వే నంబర్ 287, 289లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సదరు రైతుకు ముగ్గురు మధ్యవర్తులు మనోజ్‌కుమార్, గణేశ్, మురళి నాయక్ రూ.2 చొప్పున రూ.5లక్షల అప్పు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలో పాండుకు చెందిన 1.16ఎకరాల భూమిని షాద్‌నగర్‌కు చెందిన దేవిరెడ్డి రత్నమ్మకు రిజిస్ట్రేషన్ చేయించారు. డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన రైతు ఫిబ్రవరి 22వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి రైతును మోసం చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు నిందుతులను పరిగి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి రిమాండ్ విధించింది.

బాల కార్మికులకు విముక్తి

నందిగామ: కొంత కాలంగా బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్న పరిశ్రమపై పోలీసులు, లేబర్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరికి విముక్తి కల్పించినట్లు నందిగామ సబ్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మేకగూడ శివారులోని బ్లోటెక్ ప్యాకేజింగ్ పరిశ్రమలో కొన్ని నెలలుగా బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్నారనే విషయం తెలుసుకున్న పలువురు కార్మిక సంఘుల నేతలు మంగళవారం పరిశ్రమలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సమయంలో ఇద్దరు బాల కార్మికులు పనులు చేస్తూ కనపడటంతో విషయాన్ని పోలీసులకు, లేబర్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులను గుర్తించారు. ఈ మేరకు బాల కార్మికులకు విముక్తి కల్పించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక


అనంతగిరి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు


కొడంగల్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న భారత్ పెట్రోల్ పంప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని తదితరులు

అనంతగిరి: మట్టి వినాయకులను పూజిద్దామని వికారాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ అన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాలె లక్ష్మణ్‌గుప్తా, కార్యదర్శి యాస్కి సునీల్, ఉపాధ్యక్షుడు రఘునందన్, కోశాధికారి దోమ శ్రీకాంత్, మహిళా విభాగం అధ్యక్షురాలు మ్యాడం లక్ష్మి పలువురు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీఆర్ విద్యాసంస్థ..

వికారాబాద్‌లోని ఏసీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

మట్టి వినాయకులను పూజించాలి

కొడంగల్ రూరల్: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కెమురహరి వాసిష్ఠ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీవిద్య స్కూల్లో, కేశవస్వామి ఆలయంలో లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వడ్డె భీమరాజ్, డాక్టర్ సాకేత్, మిఠాయి రాజేందర్, దామోదర్‌రెడ్డి, శ్రీశైలం, మునీర్, మాజీ ఉప సర్పంచు ఎస్‌ఎం గౌసన్ తదితరులు పాల్గొన్నారు.


ధారూరు: విద్యార్థులు తయారు చేసిన వినాయక మట్టి ప్రతిమలతో ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

కొడంగల్: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని అందుకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఫిల్లింగ్ స్టేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని కోరారు. పట్టణ శివారులోని కోస్గి రోడ్‌లోని భారత్ పెట్రోల్ పంపు ఆవరణలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

ధారూరు: గురువుల మార్గదర్శనంతో కుక్కింద ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేసి అబ్బురపర్చారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్, ఈకో ఫ్రెండ్లీ గణేశ్ ప్రొగ్రాంలో భాగంగా జీహెచ్‌ఎం, ఉపాధ్యాయులు మట్టి వినాయకులను తయారు చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్‌ఓ విశ్వేశ్వర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ క్రాప్స్ అనేది పాఠశాల పరిశుభ్రత, పచ్చదనంతో పాటు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల జీహెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ బంకమట్టి నుంచి ఈకో ఫ్రెండ్లీ గణేశ్‌లను తయారు చేసిన విద్యార్థుల ప్రతిభ అమోఘన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఇన్‌చార్జి కమాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు గుణవంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుజాత, రాజశేఖర్, జగదీశ్వర్, సంతోష, శివప్రసాద్, యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

వినాయక చవితి సందర్భంగా ఊరూరా గణనాథులు కొలువుదిరేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా గణనాథులను స్మరించుకుంటూ ఆయా మండపాలకు తరలిస్తున్నారు. ఈ సారి పలు భిన్న ఆకృతుల్లో విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మండపాల తయారీకి అవసరమైన డెకరేషన్ సామగ్రి, పూజా వస్తువులతో దుకాణాలు కిటకిటలాడాయి. ఆయా ప్రాంతాల్లోని మండపాలను బుధవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకునేందుకు విద్యుద్దీపాలతో అలంకరించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

పరిగి: మట్టి వినాయకులను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మట్టి వినాయకుల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయకులతో జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని..

అపస్మారక స్థితిలో వ్యక్తి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో జాతీయ రహదారి 163పై గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టెపు నర్సిరెడ్డి తన ద్విచక్రవాహనంపై ప్రధాన కూడలినుంచి రోడ్డు దాటుతుండగా కొడంగల్ వైపు వేగంగా వెళ్తున్న కారు వెనకాల నుంచి బలంగా ఢీకొట్టింది. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. కర్ణాటక పాసింగ్ సిఫ్ట్ కారుగా వారు నిర్ధారించుకొని పోలీసులకు వివరించారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. తీవ్రంగా గాయపడిన విశ్రాంత ఉపాధ్యాయుడు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి


మృతుడు తలారి వినోద్ (ఫైల్)

బొంరాస్‌పేట: ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వెళ్తు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని మృతి చెందిన ఘటన కొడంగల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు..ఎన్కెపల్లి గ్రామానికి చెందిన తలారి నర్సమ్మ కుమారుడు వినోద్(21) తండ్రి కొంత కాలం క్రితమే మృతి చెందడంతో కొడంగల్‌లోని ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం ఉదయం తన స్నేహితులతో కలిసి పల్సర్ బైక్‌పై కొడంగల్‌కు వచ్చాడు. అక్కడ టిఫిన్ చేసి తన స్నేహితులకు మళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. కొడంగల్‌నుంచి పరిగి రోడ్‌లో రాంగ్ రూట్‌లో అతివేగంగా వెళ్తూ హైదరాబాద్ నుంచి సేడం వెళ్తున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వినోద్ తలకు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో స్థానికులు కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి బాబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

ఈ రోడ్డు బాగు చేయండి

మంచాల: వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన మంచాల-ఆగాపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాగజ్‌ఘట్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కావడం లేదన్నారు. ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘట్, జాపాల మీదుగా మంచాల మండల కేంద్రానికి చేరుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. రహదారిపై గోతులు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, యాదగిరి, నగేష్, యాదయ్య, భిక్షపతి, దానయ్య, భరత్, కృష్ణ, రంజిత్, మణి తదితరులు పాల్గొన్నారు.